మంగళవారం 17.03.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 329 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ దీక్ష స్మారకంగా 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు అభినందనీయం. ఆయన త్యాగంతోనే తెలుగు ప్రజల ఉనికి సాధ్యమైంది. భవిష్యత్ తరాలకు ఆ స్ఫూర్తి చేరేలా ఈ విగ్రహం నిలుస్తుంది. ఆయన ఆశయాలు, ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మిస్తున్నారు.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం



- వైశ్యులను వేర్వేరు పేర్లతో కాకుండా... ఆర్యవైశ్యులుగా పరిగణించేలా జీవో తెస్తాం
- ఇబ్బందుల్లేకుండా వ్యాపారాలు చేసుకునేలా ఆర్యవైశ్యులకు సహకరిస్తున్నాం
- అమరావతిలో తొలి భారీ శిల్పంగా అమరజీవి విగ్రహం
- శ్రీరాములు త్యాగాన్ని నిరంతరం గుర్తుంచుకునేలా స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధితోనే అమరజీవికి నిజమైన నివాళి
- శ్రీరాములు త్యాగంతో రాష్ట్రం... రైతుల త్యాగంతో రాజధాని
- పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోగలిగినప్పుడే అమరజీవి పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని నిరంతరం గుర్తుపెట్టుకుని రాష్ట్రాభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగానే అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహం ఏర్పాటైందని.. అమరజీవి త్యాగానికి గుర్తుగా ఆయన విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరు సముచితమని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతిలోని శాఖమూరు పార్కులో పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది.

అమరావతిలో తొలి భారీ శిల్పంగా పొట్టి శ్రీరాములు విగ్రహం నిలుస్తుంది. శాఖమూరు పార్కులోని 6.80 ఎకరాల్లో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 6 నెలల రికార్డు కాలంలోనే ప్రాజెక్ట్ మొదటి దశ పనులను ట్రస్ట్ పూర్తి చేసింది. ఈ భారీ విగ్రహానికి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ వినియోగించారు. రెండో దశలో మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "స్ఫూర్తికి మారు పేరు పొట్టి శ్రీరాములు. ఆయన ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు.. అందరివాడు. 58 రోజుల నిరాహారదీక్షకు చిహ్నంగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు భారీ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ అని పేరు పెట్టారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఉంది.. స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉంది... ఇప్పుడు ఏపీలో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ ఉంది. పొట్టి శ్రీరాములు మెమోరియల్ పార్కును ఆరు నెలల్లో మిగతా 2లో...




## అమరావతిలో హజ్ హౌస్ నిర్మిస్తాం



- వక్ఫ్ ఆస్తులను కూటమి ప్రభుత్వం కాపాడుతోంది
- ఇమామ్, మౌజన్‌ల గౌరవవేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తాం
- 21 నెలల్లో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు
- విజయవాడ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2లో

## ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ



- నూతన పోర్టుల్లో త్వరితగతిన ఆపరేషన్లు
- రెండో దశ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం వేగవంతం
- పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2లో

**• హామీని నిలబెట్టుకున్నా...**

## తెలుగువాడినని గర్వంగా చెప్పుకుంటా




- ఆంధ్రప్రదేశ్ గౌరవం 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్'
- త్యాగానికి మానవరూపం పొట్టి శ్రీరాములు
- పొట్టి శ్రీరాములు విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది
- ఆ గౌరవం మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు
- అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తాననే యువగళం హామీని నిలబెట్టుకున్నా
- అమరావతిలో 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ గౌరవం 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్'. త్యాగానికి మానవరూపం పొట్టి శ్రీరాములు. వారి విగ్రహం ఏర్పాటు తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిందని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ప్రజారాజధాని అమరావతిలో 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో నిర్మించిన 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని అమరజీవి త్యాగ శిల్పం వద్ద మంత్రి లోకేష్ నివాళులు అర్పించారు. అమరావతి ప్రాంతంలోని శాఖమూరులో కూటమి ప్రభుత్వం 6.8 ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటుచేస్తోంది. 6 నెలల రికార్డు సమయంలోనే ప్రాజెక్ట్ మొదట దశ పనులు పూర్తిచేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. జై వాసవీ మాత. ఒక మనిషి త్యాగం.. మిగతా 2లో...

**ప్రజల రాజధానిలో అమరజీవికి స్మృతివనం..**

## తెలుగు జాతికి గౌరవం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** భాషాప్రయుక్త రాష్ట్ర సాధనకు ఆద్యుడైన పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ ఆదర్శ ప్రాయులని, ఆమహనీయుని పేరిట, ప్రజల రాజధాని అమరావతిలో, స్మృతి వనం, ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఉడతా భక్తిగా తోడ్పాటు నీయడం శుభపరిణామమని అమరజీవి పొట్టి శ్రీరాములుకు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఘనంగా నివాళులు అర్పించారు.

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు, 125వ, జయంతి సందర్భంగా మిగతా 2లో...



## స్వార్థ ప్రయోజనాల కోసమే 'అవిశ్వాసం'

- స్పీకర్ ఓం బిర్లాకు ప్రధాని లేఖ

**దిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే తప్ప మరొకటి కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఆ పార్టీలో 'రాజవంశ మనస్తత్వం'లో కూరుకుపోయిన కొందరు వ్యక్తులు ప్రజాస్వామ్య వ్యవస్థలను తమ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. విపక్ష తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ఆదివారం ఓం బిర్లాకు ప్రధాని లేఖ రాశారు. "అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరిస్తూ నిర్ణయాత్మకంగా వ్యవహరించి ప్రతిపక్షాల రాజకీయ దుష్ప్రవర్తనను మిగతా 2లో...

## 54 వేల టన్నుల ఎల్పీజీతో గుజరాత్ చేరుకున్న శివాలిక్ నౌక



**గుజరాత్ (జర్నలిస్ట్ ఫైల్) :** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

**వ్యూహాత్మక విజయం :** ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. మిగతా 3లో...

## బీజేపీ దూకుడు...



- 144 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ తాజాగా 144 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను సోమవారం విడుదల చేసింది. ఉత్తర మరియు దక్షిణ బెంగాల్‌లోని పలు కీలక నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. మిగతా 3లో...

## అంతరాయం లేకుండా ప్రజలకు గ్యాస్ సరఫరా



- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్టుకు తరలిస్తే కఠిన చర్యలు
- ఇండక్షన్ స్టవ్స్ వంటి ప్రత్యామ్నాయాలను అన్వేషించండి
- ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలకు ఇబ్బంది ఉండకూడదు
- గ్యాస్ నిల్వలు, సరఫరాపై ఆర్టీజీఎస్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గృహ వినియోగానికి సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలకు ఇబ్బంది రాకుండా నిరంతర సరఫరా ఉండాలని సీఎం సూచించారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, బుకింగ్, సరఫరా వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సమావేశానికి ఓఎన్జీసీతోపాటు భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ సహా గ్యాస్ సరఫరా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, సరఫరా వంటి అంశాలపై పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు 3లో...

## మైనారిటీల సంక్షేమానికి రూ.6000 కోట్లు

- చంద్రబాబు నాయకత్వంలోనే మైనారిటీల సంక్షేమం
- రూ.6000 కోట్లు పైగా కేటాయించిన రాష్ట్రం ఏపీనే
- గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా
- కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ లను పూర్తి చేయని గత ప్రభుత్వం
- రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు సమావేశంలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

3లో

## రైతన్న వద్దకే ప్రభుత్వం.. లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

- పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయం పెంపు
- టెక్నాలజీతో వ్యవసాయంలో కొత్త మార్పులకు శ్రీకారం
- అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలి
- ఖరీఫ్‌ను మే 15 నుంచే ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

3లో

**స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్...**

## పొట్టి శ్రీరాములు త్యాగానికి చిరస్మరణీయ చిహ్నం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా ఆవిష్కరించారు. "స్టాచ్యూ ఆఫ్ సాక్రిఫైస్"గా పేరుపొందిన ఈ విగ్రహం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్ర సాధన కోసం 58 రోజులపాటు కఠోర నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. మహాత్మా గాంధీ మార్గంలో సత్యాగ్రహాన్ని ఆయుధంగా మలచుకుని ఆయన పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆయన మరణం అనంతరం గాంధీజీ అనుచరుడు కుమారప్ప "మరొక గాంధీ మరణించాడు" అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.

రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగానికి ప్రతీకగా నిలిచిన రాజధాని ప్రాంతంలోనే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషమని తెలిపారు. ఇది కేవలం మిగతా 3లో...

# ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్ల ద్వారా ఈస్ట్ -వెస్ట్ కార్గో కారిడార్గా ఏపీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితం అవుతున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల్లో త్వరితగతిన కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్లు ప్రారంభం కావాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మూడు పోర్టుల నుంచి పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా, కర్ణాటకల హింటర్ ల్యాండ్ నుంచి కార్గో రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు 2026 డిసెంబరు నాటికి పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ కూడా ఏర్పాటైన అనంతరం కంటైనర్, బల్క్ కార్గో పోర్టుగా రామాయపట్నం మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకూ ప్రత్యేక మార్గాన్ని వేసేందుకు కూడా రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. మూడు పోర్టులకు సమీపంలోనూ పోర్టు టౌన్ షిప్ ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య పరమైన లావాదేవీలు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు పోర్టులకు సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లు కూడా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉందన్నారు. రెండో దశలో బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్లను కూడా వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీప భవిష్యత్తులో ప్రతీ 50 కిలోమీటర్లకు పోర్టు, ఫిషింగ్ హార్బర్లు రానున్న నేపథ్యంలో ఈస్ట్ కోస్టు లాజిస్టిక్స్ హబ్ గా ఏపీ మారుతుందన్నారు. ఏపీలో ఉన్న పోర్టులు కార్గో హ్యాండ్లింగ్‌లో గేమ్ ఛేంజర్‌గా మారాలని సీఎం సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధం కారణంగా దుబాయ్, గల్ఫ్ దేశాల్లోని ఓడరేవులు ఇబ్బందుల్లో పడ్డాయని.. ఇప్పుడు భారత్ లోని ఈస్ట్ కోస్ట్ లో ఉన్న పోర్టులే సురక్షితం అన్న అభిప్రాయం వచ్చిందని ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, మారి టైమ్ బోర్డు సీఈఓ అభిషేక్ కుమార్ హాజరయ్యారు.

# స్వార్థ ప్రయోజనాల కోసమే 'అవిశ్వాసం'



(మొదటి పేజీ తరువాయి)

తిప్పికొట్టిన సభ్యులను నేను అభినందిస్తున్నాను. తీర్మానం వీగిపోయాక పార్లమెంటరీ చరిత్ర, స్పీకర్ విధులు, నియమాల ప్రాధాన్యంపై సభలో మీరు చేసిన ప్రకటన శ్రద్ధగా విన్నాను. మీ సంయమనం, ఓర్పు అభినందనీయం" అని పేర్కొన్నారు. ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ లేఖను స్పీకర్ ఓం బిర్లా 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సంప్రదాయాలు, నియమ నిబంధనలపై మీరెప్పుడూ అచంచల విశ్వాసం చూపించారు. మీ ఈ సందేశం ప్రజాప్రతినిధులు అందరికీ స్ఫూర్తిదాయకం. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ రచయితలు వేసిన నైతిక పునాదిని ఇది బలోపేతం చేస్తుంది" అని ఓం బిర్లా ప్రధానికి బదులిచ్చారు.

**సభా నియమాలపై పార్టీలకు స్పీకర్ లేఖలు :** లోక్‌సభలో కొందరు సభ్యులు బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శిస్తూ అనుచిత వ్యాఖ్యలకు దిగడంపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సభలో సభ్యులందరూ క్రమశిక్షణను, ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించేలా చూడాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీల నేతలకు ఆయన లేఖలు రాశారు. ప్రజాస్వామ్య సంస్థల గౌరవం, ప్రతిష్ఠను కాపాడుకోడానికి తీవ్రంగా ఆలోచించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అందులో పేర్కొన్నారు.

# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మొదటి దశ పనులు పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి... ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలి. తెలుగువారికి గుర్తింపు కూడా లేని రోజుల్లో తెలుగు వారి సత్తా చాటిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతంలో స్వాతంత్ర్యం తెచ్చారు... పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారు. ప్రాణాలను లెక్క చేయకుండా తెలుగు వారికి రాష్ట్రం కోసం పోరాడారు. పొట్టి శ్రీరాములు త్యాగం తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలకు కేంద్రం నాందీ పలికింది. ఐదు దశాబ్దాల్లో అనునిత్యం అనేక విషయాల్లో పొట్టి శ్రీరాములు పోరాడారు. భార్య పిల్లలు చనిపోయిన తర్వాత ఆ బాధను దింగమింగి దేశ కోసం పోరాడారు. దళితుల ఆలయ ప్రవేశం కోసం పోరాడారు.. 29 రోజుల నిరాహార దీక్ష చేశారు. కనీసం నీళ్లు కూడా తాగకుండా 58 రోజుల దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారు. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగు జాతి గుర్తు పెట్టుకోవాలి"అని సీఎం చెప్పారు.

**తెలుగు జాతికి నిత్యం సమస్యలే... :** "తొలుత మదరాసు ఏలుబడిలో ఉన్న తెలుగు ప్రజలు.. పొట్టి శ్రీరాములు పోరాటంతో ఆంధ్ర రాజధాని కర్నూలుగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ గా ఏర్పాటు చేసుకుని తెలుగు జాతి మనుగడ సాగించింది. ఆ తర్వాత అమరావతి రాజధానిగా నవ్యాంధ్ర రాష్ట్రం ఏర్పడింది. పొట్టి శ్రీరాములు వంటి వారి త్యాగాలను నిరంతరం గుర్తు పెట్టుకోవాలి... రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి. అమరజీవి త్యాగ ఫలితంగా రాష్ట్రం వచ్చింది.. ఆయన స్ఫూర్తిని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. సమస్యలు వచ్చినా... ఇబ్బందులు వచ్చినా ప్రజలంతా సమిష్టిగా పని చేయాలి. తెలుగు జాతి గతంలోనూ... ఇప్పుడూ అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. 2019-24 మధ్య కాలంలో రాజధాని



మూడు ముక్కలాటగా మారింది. మూడు రాజధానులన్నారు... అసలు రాజధానే లేని పరిస్థితి తెచ్చారు. ఇప్పుడు ప్రజా రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందుతోంది. తెలుగు జాతి వివిధ సమయాల్లో విడిపోయి ఉంది.. వివిధ సందర్భాల్లో కలిసి ఉంది. అందరికీ న్యాయం చేయగలినప్పుడే పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి. ఇది జరిగినప్పుడే పొట్టి శ్రీరాముల త్యాగానికి సార్థకత చేకూరుతుంది"అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**రాజధానిని మూడు ముక్కలాట చేశారు... :** "తెలుగు జాతికి రెండు రాష్ట్రాలు ఉన్నాయి. రాజధానితో గత పాలకులు ఆటలాడారు... బాధేస్తోంది. అమరావతిని శ్మాసనం అన్నారు.. ఎడారి అన్నారు.. ఇక్కడ రాజధాని ఉండకూడదన్నారు. పొట్టి శ్రీరాముల త్యాగాన్ని ముందుగా ఎవ్వరూ గుర్తించని విధంగానే... ఇక్కడి రైతుల త్యాగాన్ని కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతుల త్యాగం ఓ స్ఫూర్తి.. చరిత్ర. 2019-24 మధ్య కాలంలో రాజధాని రైతుల పోరాటం ఓ చరిత్ర. రాజధాని నిర్మాణానికి డబ్బులు లేనప్పుడు ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రాజధాని ఏర్పాటు ప్రారంభించాం. ప్రజలను భాగస్వాములను చేసి రాజధాని నిర్మాణం మొదలు పెట్టాం. రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. 21 నెలల పాటు మంచి ఫలితాలు సాధించేలా పాలన చేస్తున్నాం. సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. పోలవరం ఆంధ్రప్రదేశ్ జీవనాడి... ఇలాంటి ప్రాజెక్టును విధ్వంసం చేశారు. పోలవరం నిర్మాణం వేగంగా సాగుతోంది... పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండడమే కాదు... రాష్ట్రానికి రాజధాని కూడా ఉండాలి. నా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా రాజధానిని తీర్చిదిద్దుతాం. మూడేళ్లల్లో అమరావతి ఎలా అభివృద్ధి చేస్తామో మీరే చూస్తారు. రాజధాని అమరావతిపై కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర బిందువుగా రాజధాని అభివృద్ధి ఉంటుంది"అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం... :** "ఈ ప్రభుత్వం అందరి ప్రభుత్వం... ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. గడచిన ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకునేందుకు భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎలాంటి భయాందోళనలు లేకుండా వ్యాపారాలు చేసుకునే పరిస్థితి వచ్చింది. సంపాదించిన సొత్తులో కొంత భాగం దాన ధర్మాలకు ఖర్చు చేసే ఏకైక వర్గం ఆర్యవైశ్యులు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని కూడా ఆర్యవైశ్యులు అదే సంకల్పంతో పూర్తి చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా చేపడుతున్నాం. వాసవీ మాత పుట్టిన ప్రాంతం పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చాం. ఆర్యవైశ్యుల సెంటిమెంట్ గౌరవించాం. ఇంటింటికీ నీళ్లిచ్చే జల జీవన్ మిషన్ పథకానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అమరజీవి జలధార' అని పేరు పెట్టారు. నీరు తాగే ప్రతి ఒక్కరూ అమరజీవిని స్మరించుకునేలా పవన్ కళ్యాణ్ చొరవ చూపారు. వైశ్యులను వేర్వేరు పేర్లతో కాకుండా... అందర్నీ ఆర్యవైశ్యులు అని పరిగణించేలా జీవో తెస్తాం. అభివృద్ధి-సంక్షేమం సమతూకంతో సుపరిపాలన సాగిస్తాం. హెల్తీ-వెల్తీ-హ్యాపీ సొసైటీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. యుద్ద ప్రభావంతో రాష్ట్రంలో వివిధ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఇబ్బందులు వస్తున్నాయి. యుద్ద ప్రభావం దేశం మీద పడకుండా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారు. యుద్ధం ప్రభావం ఉందని కుంగిపోవాల్సిన అవసరం లేదు. కష్టకాలంలో సమిష్టిగా పని చేయాలి... అభివృద్ధి ఆగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని మోదీ పని చేస్తున్నారు...దేశంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్-1 చేసేలా మనం పని చేయాలి"అని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, సవిత సహా పలువురు ప్రజా ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. అమరజీవి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. విగ్రహావిష్కరణ సభలో అమరావతి అభివృద్ధి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టబోయే కార్యక్రమాలపై ఏవీ ప్రదర్శించారు. తపాలా శాఖ రూపొందించిన పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్ ను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేదికపై సన్మానించారు.

# అమరావతిలో హజ్ హౌస్ నిర్మిస్తాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇమామ్, మౌజన్‌లకు ఇచ్చే గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో నూతనంగా హజ్ హౌస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకు 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అందించిందని వివరించారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం తరపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నాం. అన్ని జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాం. రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలకు దానం చేస్తే సంతోషంగా ఉంటారని మహ్మద్ ప్రవక్త బోధించారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన సూక్తి. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తేవటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముస్లింలలో 4.38 లక్షల మందికి ఇస్తూ ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 4.5 లక్షల మంది ముస్లిం విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తున్నాం. పోస్ట్



మెట్రిక్ స్కాలర్ షిప్పులు 19,215 మందికి రూ.264 కోట్లు విడుదల చేశాం. దీపం-2.0 పథకం కింద 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లతో సిలిండర్లకు ఖర్చు చేస్తున్నాం. ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్లకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనంగా రూ.180 కోట్లు అందించాం. మరో రూ.45 కోట్ల బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించాను."అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ముస్లింల మనోభావాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది :** "అర్హత కలిగిన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నాం. వివాహ లైసెన్స్ గడువు 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచాం. 347 మంది ముస్లింలు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నాం. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు ఇచ్చాం. యువతకు నైపుణ్యాలు అందించి మెరుగైన ఉపాధి ఉద్యోగాలు దక్కేలా చేస్తున్నాం. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారు. ఆ జీవోను రద్దు చేసి వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్థీకరణ చేశాం. 1500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేశాం. వక్ఫ్ ఆస్తులను కాపాడుతున్నాం. నూర్ బాషా ఫెడరేషన్ పేరును దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పోరేషనుగా మార్పు చేసి రూ.100 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే... ఈసారి రూ.6,090 కోట్లు కేటాయించాం. ఉర్దూ అకాడమీకి గత పాలకులు రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో రూ.7 కోట్లు మంజూరు చేశాం. అబ్దుల్ హక్ అవార్డు కింద రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఉర్దూ ఘర్, షాధీ ఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించాం. ముస్లిం జీవన ప్రమాణాలు పెంచేలా చేస్తున్నాం. అన్ని మతాలను గౌరవిస్తా... అందరివాడిలా ఉంటా. పేదలను ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. ఎక్కడ పేదవాడు ఉంటే అక్కడ నేను ఉంటా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు నజీర్, బోండా ఉమ, గద్దె రామ్మోహన్, పలువురు ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

# ప్రజల రాజధానిలో అమరజీవికి స్మృతివనం.. తెలుగు జాతికి గౌరవం



(మొదటి పేజీ తరువాయి)

ఆర్యవైశ్య నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పులదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పొట్టి శ్రీరాములు జీవితం తెరచిన పుస్తకమని కొనియాడారు. మితభాషి అయినప్పటికీ, సమస్యల పట్ల అవగాహనతొ, పోరాడె మనసున్న మహానేత శ్రీరాములని అన్నారు. ఆయన తెలుగువారి కోసం చేసిన త్యాగం తెలుగుజాతి మరువలేనిదని అన్నారు.భాషా ప్రయుక్త రాష్ట్రం సాధించిన అమరజీవి స్ఫూర్తితొ, తెలుగు భాషను కాపాడు కోవాల్సిన బాద్యత తెలుగువారందరి పైనా ఉందన్నారు. కుటమి ప్రభుత్వం ద్వారా ప్రజల రాజధాని అమరావతిలో, అమరజీవికి స్రుమ్రుతి వనం, భవనం, భారీ కాంశ విగ్రహం ఏర్పాటుతో పాటుగా తెలుగుభాషా వికాసానికి ప్రాధాన్యం కల్పించడంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈకార్యక్రమంలొ కొప్పురావురి కిషోర్, దేసు యుగంధర్, అప్పల సునీల్, పెండేల చంద్ర, దేసు రవికుమార్, శ్రీనంత్, పట్టణ టిడిపి అద్యక్షులు మహ్మద్ కుద్దూస్, కేసన కోటేశ్వరరావు, రావి చిన్ని, కోగంటి రోహిత్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


# హామీని నిలబెట్టుకున్నా... తెలుగువాడినని గర్వంగా చెప్పుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

ఒక జాతి గౌరవం. ఒక దీక్ష.. ఒక రాష్ట్రం. అమరజీవి.. చిరంజీవి. మరణంలేని గొప్ప శక్తి. త్యాగానికి మానవరూపం. ఆంధ్రప్రదేశ్ రూపంలో జీవించే ఉన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి రోజు 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం ఈ 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్'. డూండి రాకేష్ నా దగ్గరకు వచ్చి ఏం పేరు పెట్టాలనేదానిపై సలహా అడిగారు. అప్పుడు నా మనసులో తోచింది ఒక్కటే ఆ విగ్రహం చూస్తే ఆయన త్యాగం గుర్తుకురావాలి. అందుకే 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని పెడదాం అని చెప్పాను. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

**నేను తెలుగువాడినని గర్వంగా చెప్పుకుంటున్నాను :** నేను తెలుగువాడిని, నేను ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నాను. ఆ గర్వం మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు. ఆయన ఒక వ్యక్తి కాదు తెలుగు గౌరవం. ఆయన ప్రాణత్యాగం.. మన రాష్ట్రం. ఆ మహనీయుడి జయంతి.. మన ఆంధ్రులకు పండుగ. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను.

**ఈ విగ్రహం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని మనకు నిత్యం గుర్తుచేస్తుంది :** యువగళం పాదయాత్రలో నేను ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిశాను. వాళ్లకి ఉన్న సమస్యల గురించి చర్చించాం. అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని పరిష్కరించాం, ఇంకొన్ని సమస్యలు ఉన్నాయి. అవి కూడా పరిష్కరిస్తాం. అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని తక్కువ సమయంలోనే నిలబెట్టుకోవడం ఆనందంగా ఉంది. 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' 58 అడుగులు అమరజీవి ఆమరణ దీక్షచేసిన 58 రోజులకు సంకేతం. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకోసం ఆయన చేసిన త్యాగాన్ని మనకు ప్రతిరోజు గుర్తుచేస్తుంది. మనం ఒకరోజు ఉపవాసం ఉండాలి అంటే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్ర ఏర్పాటుకోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్ర భావితరాలకు అందించడం మన బాధ్యత. 2025 సెప్టెంబర్ 3న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాం.



194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం, ట్రస్ట్, అధికారులు, సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు అందరినీ అభినందిస్తున్నాను. మా రౌడీ డూండీని ఎప్పుడూ స్పీడ్ పెంచాలి అంటూ ఉంటాను. విగ్రహ ఏర్పాటుమాత్రం జెట్ స్పీడ్ లో చేశారు. ఇంత స్పీడ్ గా చేస్తారు అని నేను ఊహించలేదు.

**అమరజీవి పొట్టి శ్రీరాములు నిత్యపోరాటయోధుడు :** పొట్టి శ్రీరాములు స్వార్థంలేని ఉద్యమం చేశారు. సమాజాభివృద్ధి కోసం ఒక కార్యకర్తలా పనిచేశారు. రాజకీయాలు చేయలేదు. పదవులు ఆశించలేదు. గాంధీ సబర్మతి ఆశ్రమంలో చేరారు. స్వాతంత్ర్యం కోసం పోరాడారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లారు. నెల్లూరులో దళితులకు ఆలయప్రవేశం కోసం ఉద్యమించారు. అంటరానితనంపై పోరాడారు. ఐదుసార్లు నిరాహార దీక్షలు చేశారు. నాడు ఆంధ్రుల ఇబ్బందులు ప్రత్యక్షంగా చూశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేయకపోవడం మహాపాపం అని ప్రకటించారు. కొందరి స్వార్థం కోసం ఆంధ్రుల ఆత్మగౌరవం బలికాకూడదన్నారు. వస్తే ప్రత్యేక రాష్ట్రం..పోతే తన ప్రాణం అనుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే ఆమరణదీక్ష చేస్తానన్నారు. ఆయన నిత్యపోరాటయోధుడు. ఆయన నా యువగళం పాదయాత్రకు స్ఫూర్తి. అప్పటి ప్రభుత్వం నా నైట్ బస్ పెట్టుకోవడానికి ఎవరైనా భూమి ఇస్తే 22-ఏలో పెడతామని బెదిరించారు. అప్పుడు నేను ఒకటే చెప్పేవాడిని. ఎవరూ స్థలం ఇవ్వకపోతే నేను రోడ్డు మీద పడుకుంటా అని.

**58 రోజులపాటు దీక్ష చేసి ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారు :** మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో 1952 అక్టోబర్ 19వ తేదీన ఆమరణ దీక్ష ప్రారంభించారు. దీక్ష మొదటి రోజు 53.9 కేజీల బరువు ఉన్న పొట్టి శ్రీరాములు 58వ రోజు 38.1 కేజీలకు తగ్గారు. పొట్టి శ్రీరాములు గారి స్థానంలో ఏ ఒక్కరున్నా దీక్ష విరమించేవారు. అమరజీవి తాను అనుకున్నట్టే వస్తే రాష్ట్రం..పోతే ప్రాణం అనుకుని దీక్ష విరమించలేదు. 58 రోజులపాటు దీక్ష చేసి తన ప్రాణాలను త్యాగం చేశారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారు. ఒక్క ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించింది. ఢిల్లీ దిగివచ్చింది. కర్నూలు రాజధానిగా 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.

**భారతదేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంపై అమరజీవి తీవ్ర ప్రభావం చూపారు :** ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ.. అమరజీవి పొట్టి శ్రీరాములు గురించి ఒక వ్యాసం రాశారు. దురదృష్టం ఏంటంటే ఆంధ్రప్రదేశ్ బయట పొట్టి శ్రీరాములు గారిని మర్చిపోయారు అని రాస్తూ.. ఆయన ఏం చెప్పారో తెలుసా? భారతదేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంపై అమరజీవి తీవ్ర ప్రభావం చూపారు. ఆయన దీక్ష తరువాత.. భారతదేశ చిత్రపటంపై భాషాప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని అన్నారు. పొట్టి శ్రీరాములు గారిని భారతదేశ మెర్కాటర్ గా రామచంద్ర గుహ అభివర్ణించారు. 1569లో ప్రపంచ పటాన్ని తయారు చేసిన జర్మన్-ఫ్లెమిష్ భౌగోళిక శాస్త్రవేత్త ఈ మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి మన పొట్టి శ్రీరాములు గారి చరిత్ర దేశం మొత్తం గుర్తుపెట్టుకునేలా ఈ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం మన అదృష్టం.

**రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి రోశయ్య:** మీతో ఎప్పుడు సమావేశం అయినా మొదట గుర్తొచ్చేది రోశయ్య తాత. ఆయన రాజకీయాల్లో స్టేట్స్ మ్యాన్. ఆయన అసెంబ్లీలో మాట్లాడితే అంతా నిశ్శబ్దం. అంత శ్రద్ధగా వినేవారు. ఆయన లేని లోటు కనిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ప్రతి పుట్టిన రోజుకి నేను ఫోన్ చేసి మాట్లాడేవాడిని. రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి మాజీ సీఎం రోశయ్య.

**అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటుచేస్తాననే యువగళం హామీని నిలబెట్టుకున్నా :** ఎన్ని కోరికలు తీర్చినా మన డూండి రాకేష్ కు ఇంకో చివరి కోరిక ఉంటుంది. ఇప్పుడు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల చేయాలని అడిగారు. కేంద్ర ప్రభుత్వంలో మాట్లాడి స్మారక నాణెం విడుదల కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఆయన జయంతి రోజున నేను ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం నా అదృష్టం. భారతదేశమే ఆశ్చర్యపోయేలా విగ్రహావిష్కరణ జరిగింది. యువగళం హామీ నెరవేర్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గారికి, ట్రస్ట్ వారికి, 10 రూపాయల దగ్గర నుంచి కోటి రూపాయలు విరాళం ఇచ్చిన వారు ఉన్నారు. విరాళం ఎంత అనేది కాదు.. మంచిపనిలో భాగస్వామ్యం అవ్వాలనే ఆలోచన గొప్పది. సీఆర్డీయే, అధికారులు, ఆర్యవైశ్య పెద్దలకు అందరికీ అభినందనలు. 12 నెలల్లోనే స్మృతి వనం, ఫోటో గ్యాలరీ, మ్యూజియం, మినీ థియేటర్, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ల నిర్మాణం పూర్తిచేయాలని మంత్రి చెప్పారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి.నారాయణ, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య), ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య సామాజిక వర్గ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 54 వేల టన్నుల ఎల్పీజీతో గుజరాత్ చేరుకున్న శివాలిక్ నౌక


(మొదటి పేజీ తరువాయి)

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.

శివాలిక్ ఎల్పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం.

**హోర్ముజ్ జలసంధి ప్రాముఖ్యత :** ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్...



(మొదటి పేజీ తరువాయి)

ఒక విగ్రహం మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే చారిత్రక చిహ్నంగా నిలుస్తుందని అన్నారు.

దళితుల హక్కులు, తెలుగు జాతి ఆత్మాభిమానం కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విగ్రహ నిర్మాణానికి సహకరించిన పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, దాతలను పీవీఎన్ మాధవ్ అభినందించారు.

రాజధాని లో ఏర్పాటు చేసిన ఈ భారీ విగ్రహం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, ఆంధ్ర రాష్ట్ర గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

# బీజేపీ దూకుడు...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వంటి అగ్రనేతలు పాల్గొని, క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు.

**తొలి జాబితాలో ప్రముఖులు వీరే.. :** బీజేపీ విడుదల చేసిన ఈ జాబితాలో పార్టీకి చెందిన ఉద్దండులు మరియు విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులకు చోటు దక్కింది. నందిగ్రామ్ నుంచి సువేందు అధికారి, అసన్సోల్ దక్షిణ్ నుంచి అగ్నిమిత్ర పాల్, శిబ్‌పూర్ నుంచి రుద్రనీల్ ఘోష్, ఉలుబేరియా దక్షిణ్ నుండి స్వామి మంగళానంద పురి మహారాజ్, చక్దా నుంచి బంకిం చంద్ర ఘోష్, పాంస్కురా నుంచి సుబ్రతా మైత్రా, దేగంగా నుంచి తరుణ్ కాంతి ఘోష్ నుంచి బరిలోకి దిగుతున్నారు.

**ఎన్నికల బరిలో ఆధిక్యం కోసం.. :** మొత్తం 294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మెజారిటీ సాధించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు దీటైన పోటీ ఇచ్చేలా, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఈ 144 మందిని ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే మిగిలిన స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల పేర్లను కూడా వెల్లడించనున్నారు.

# అంతరాయం లేకుండా ప్రజలకు గ్యాస్ సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17,209 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉందని ఉన్నతాధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్ పీసీఎల్,బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలకు చెందిన 1154 ఏజెన్సీల నుంచి గ్యాస్ సరఫరా అవుతోందని అధికారుల వెల్లడించారు. ఈ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలి పోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి వినియోగదారు నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. న్యూజూ సంస్థ 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని...ఆ తర్వాత స్థానాల్లో బీపీసీఎల్, ఐఓసీఎల్ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే... స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ..ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్యాస్ డెలివరి విషయంలో సిలిండర్లు దుర్వినియోగం కాకుండా టెక్నాలజీని ఉపయోగించి పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరా విషయంలో సాధారణ పరిస్థితుల్లో ఒకటిన్నర



రోజుల్లోనే డెలివరి జరిగేదని...కానీ ఇప్పుడు రెండున్నర రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు. గతంతో పోల్చుకుంటే రీఫిల్ బుకింగ్ గడవు పెరిగిందని... ఇలాంటి సమయంలో గతంలో మాదిరిగానే డెలివరిని ఒకటిన్నర రోజుల్లోనే అందించగలిగితే ప్రజల్లో గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన ఉండదని సీఎం చంద్రబాబు సూచించారు. ఎల్పీజీ సరఫరా విషయంలో ప్రజల్లోని ఆందోళనలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**కీలక వ్యవస్థలకు ఇబ్బంది కలగకూడదు :** కొన్ని కీలక వ్యవస్థలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అన్నక్యాంటీన్లకు గ్యాస్ సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 సెంట్రల్లీ కిచెన్ల ద్వారా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా జరుగుతోందని... వాటికి ఎలాంటి ఇబ్బందుల్లేవని అధికారులు చెప్పారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో మానిటర్ చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో పాటు ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలు వంటి వాటిల్లో రోజు వారీ కార్యాకలాపాలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని..నిరంతరం ఆయా శాఖలకు చెందిన అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్లు వంటి వాటిల్లో కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ వినియోగం తగ్గించుకునేలా హోటళ్ల అసోసియేషన్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే హోటళ్ల అసోసియేషన్లకు చెందిన కొందరు ప్రతినిధులతో మాట్లాడుతున్నామని... వాళ్లు ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామన్నారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎం చంద్రబాబుకు వివరించారు. ఇక చిన్న చిన్న వ్యాపారులకు రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు పడకుండా.. వారి జీవనోపాధికి ఆటంకం కలగకుండా ఉండేలా కిరోసిన్ సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశంలో ప్రస్తావించారు. ఇక ఎల్పీజీ గ్యాస్ సరఫరాకు ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. సంక్షోభ సమయంలోనే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచన చేసి.. వ్యవస్థలను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. యుద్ధం జరుగుతున్న సందర్భంలోనే కాకుండా.. యుద్ద విరమణ తర్వాత కూడా కొన్ని రోజులు పాటు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదని.. వాటిని కూడా అంచనా వేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక ఓఎన్జీసీ, గెయిల్, బీజీఎల్ వంటి సంస్థలతో ఇంటింటికి గ్యాస్ పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చే సంస్థలు సమన్వయం చేసుకుని పని చేయాలని సీఎం సూచించారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్ లైన్ల విస్తరణకు అవసరమైన చర్యలపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. ఇండక్షన్ స్టవ్ లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు త్వరలోనే మరింత ఎల్పీజీ కేటాయింపులను కేంద్రం చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. వివిధ ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యల పైనా అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి రూ.6000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి నేటి వరకు ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యలతో కూడిన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం విజయవాడ ఏ- కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రస్థాయితో పాటు, అన్ని జిల్లాలలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏ-కన్వెన్షన్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన ముస్లిం మైనారిటీలను ఉద్దేశించి మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రసంగించారు. రాష్ట్రం కోసం,రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని, ఈ ఘనత చంద్రబాబుకి దక్కుతుందని అన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుకు రూ. 1.50కోట్లు నిధులు విడుదల చేసిన ఘనత కూడా చంద్రబాబుదే నని అన్నారు.లి

**మైనారిటీ కుటుంబాలకు అండగా "తల్లికి వందనం" :** రాష్ట్రంలో అమలవుతున్న తల్లికి వందనం పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక కుటుంబాల్లోని పిల్లల చదువుకు విశేషంగా లబ్ధి చేకూరుతోందని మదనపల్లెలో తనకు ఎదురైన ఒక ప్రత్యక్ష ఉదాహరణ అంశాన్ని మంత్రి ఫరూక్ సమావేశంలో వెల్లడించారు. ఏ ప్రభుత్వంలో మైనారిటీలకు మేలు జరిగిందన్న విషయాన్ని మైనారిటీలందరూ గుర్తించి గుండెల్లో పెట్టుకోవలసిన అవసరం ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. మదనపల్లెలో తాను ఒక



సమావేశానికి హాజరు అయిన నేపథ్యంలో ఒక ముస్లిం వ్యక్తి వచ్చి తనకు దండ వేశారని, నాకెందుకు వేస్తున్నారని అడగగా.. తనకు 12 మంది పిల్లలు.. అందులో 6 మందికి తల్లికి వందనం మంజూరు అయిందని చెప్పి సంతోషం వ్యక్తం చేశారన్నారు. దీన్నిబట్టి తల్లికి వందనం పథకం తో మైనారిటీలు, పేదలు, శ్రామిక కుటుంబాలలోని పిల్లలకు ఎంత మేలు జరిగిందన్న విషయం, చదువుకు ఇచ్చిన ప్రాధాన్యత నెరవేరిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మంత్రి ఫరూక్ అన్నారు. ఏపీలో మైనారిటీల సంక్షేమం కోసం రూ. 6000 కోట్ల బడ్జెట్ ను కేటాయించిన ఘనత దేశం లోని ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ. 3000 కోట్లతో మైనారిటీల సంక్షేమం కు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నాంది పలికిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు.

**గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా :** 2019-2024 గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి ఒక్క పైసా ఖర్చు చేయలేదని, అభివృద్ధి సున్నా అని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజమెత్తారు. టిడిపి ప్రభుత్వంలో 342 షాదిఖానాలు నిర్మించడం జరిగిందన్నారు. అయితే కేవలం రెండు షాదీఖానాలను మాత్రమే గత ప్రభుత్వం నిర్మించిందని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం విజయవాడలో హౌస్ కు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ కు, కడపలో హజ్ హౌస్ కు నిధులు కేటాయించి దాదాపుగా నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సొంత ఊరు పులివెందులలో కూడా షాది ఖానా నిర్మించలేదని, కడపలో హజ్ హౌస్, గుంటూరులో క్రిస్టియన్ భవన్ ల నిర్మాణాలను కూడా పట్టించుకోకుండా, పెండింగ్ పనులను పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం, ఉపాధి కోసం ఆటోనగర్ లను ఏర్పాటు చేసి, భూములు కేటాయించిన ఘనత కూడా చంద్రబాబు దేన ని అన్నారు. నంద్యాల, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆటోనగర్ లు చంద్రబాబు హయాంలోనే ఏర్పాటు అయిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో 49,161 మంది ఉపాధి కోసం రూ.280 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మైనారిటీ యువత శిక్షణ కోసం 41088 మందికి రూ. 53.89 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. మైనారిటీలందరూ గుండె మీద చేయి వేసుకొని ఏ ప్రభుత్వమైతే తమ సంక్షేమానికి కృషి చేసిందో, ఆ ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. రంజాన్ కు ఒకరోజు ముందు హిందువుల పర్వదినం ఉగాది, మరుసటి రోజు రంజాన్ పర్వదినాల సందర్భంగా మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు,ముస్లిం లందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలను రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

# పొట్టి శ్రీరాములు ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



• బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు నేతృత్వంలో పార్టీ నాయకులు గుంటూరులోని హిందూ కాలేజీ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. స్వార్థరహితంగా సమాజ అభివృద్ధి కోసం ఉద్యమం చేసిన ఆయన రాజకీయ పదవులు ఆశించకుండా ఒక సాధారణ కార్యకర్తలా ప్రజల కోసం పనిచేశారని తెలిపారు.

మహాత్మా గాంధీ ప్రభావంతో సబర్మతి ఆశ్రమంలో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, సత్యాగ్రహ పోరాటంలో భాగంగా జైలు శిక్షను కూడా అనుభవించారని గుర్తు చేశారు. నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం కల్పించేందుకు ఉద్యమం నిర్వహించి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. ఆంధ్రుల సమస్యలను ప్రత్యక్షంగా గమనించి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేయాలని సంకల్పించి ఐదుసార్లు నిరాహార దీక్షలు చేపట్టారని తెలిపారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి తన ప్రాణాలను త్యాగం చేయడంతో ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని, నేటి తెలుగు ప్రజల ఉనికి ఆయన పోరాట ఫలితమేనని చెప్పారు. పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి తరువాత భాషాపరమైన రాష్ట్రాల ఏర్పాటుకు కూడా మార్గం సుగమం అయ్యిందన్నారు.


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించడం అభినందనీయ నిర్ణయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం హర్షణీయమన్నారు. యువత పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చరక కుమార్ గౌడ్, దేశు సత్యనారాయణ, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, దానబోయిన శివయ్య, రావూరి, అప్పిశెట్టి రంగారావు, పార్ధసారధి, మండల అధ్యక్షులు మల్లాల లక్ష్మణ్ గౌడ్, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న వద్దకే ప్రభుత్వం.. లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రతి రైతు వద్దకే ప్రభుత్వం వెళ్లి లాభసాటి వ్యవసాయం దిశగా మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా "రైతన్న.. మీకోసం" కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గొల్లపూడిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తో కలసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. స్థానిక రైతులతో కలసి గ్రామంలో తిరుగుతూ కరపత్రాలను రైతులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతన్నా మీకోసం" కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, 62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో రైతును "రాజు"గా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు రైతులకు మద్దతుగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి రైతు సేవా కేంద్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడ సాగులో ఉన్న పంటలు, రైతుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్ ధరలను దృష్టిలో పెట్టుకుని ఏ ప్రాంతంలో ఏ పంటలు సాగు చేయాలో ముందుగానే సూచనలు అందజేస్తామని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల అభివృద్ధి కోసం ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సుమారు 80 శాతం నీటి నిల్వలు ఉన్నాయని, కాలువల మరమ్మతులు పూర్తి చేసి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మార్కెట్‌లో అధిక ధరలు లభించే పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో పాటు మండవల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధరలు పడిపోయినప్పుడు పొగాకు, మామిడి, కోకో, టమోటా, ఉల్లి రైతులకు 588 కోట్ల రూపాయలు ఖర్చుచేసి సుమారు లక్ష మంది రైతులను ప్రభుత్వం ఆదుకుందని, రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని తెలిపారు. గల్ఫ్ లో యుద్ధం కారణంగా ఎగుమతి పంటలైన కొబ్బరి, మొక్కజొన్న, అరటి, వంటి పంటల ధరలు తగ్గాయని వాటి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను, మార్కెట్లను అన్వేషించి రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన పలు ఇన్ పుట్ పరికరాల దిగుమతిలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని కూడా అధిగమించి రైతులకు ఇబ్బంది లేకుండా



ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20,000 ఆర్థిక సహాయాన్ని మూడు విడతల్లో జమ చేసామని, సీఎం చంద్రబాబు బటన్ నొక్కిన గంటలోనే 99.75 శాతం మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందని తెలిపారు. మే 15 నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రిజర్వాయర్లలో నీరు ఉన్న నేపథ్యంలో రెండు నెలల ముందుగానే సాగు మొదలుపెడితే అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి ఒక సచివాలయాన్ని సందర్శించి "రైతన్న.. మీకోసం" కార్యక్రమాన్ని ముగిస్తారని మంత్రి తెలిపారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహిస్తూ నీటి వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్ట్‌పై గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు దాని గొప్పతనాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. మారుతున్న ఆహార అలవాట్లు, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణ (డైవర్సిఫికేషన్) వైపు వెళ్లాలని సూచించారు. ఏలూరు ప్రాంతంలో పామాయిల్ సాగుతో రైతులు ఎకరాకు మంచి లాభాలు పొందుతున్నారని, కోకో, మిరియాల వంటి పంటల సాగు కూడా విస్తరిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ ధర పామాయిల్‌కు రాష్ట్రంలో లభిస్తోందని చెప్పారు.

గత ఐదేళ్లలో వ్యవసాయ శాఖను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో , ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో వ్యవసాయ రంగాన్ని తిరిగి బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికత వినియోగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి పంటకు కవర్లు సబ్సిడీతో అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా మార్పు తీసుకురావాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే విధంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రైతులు పనిచేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విమర్శలు చేయడం తప్ప వైసీపీకి మరే పని లేదని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవలం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతులు, ఎన్డీయే కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ నాయకుడు తోట తిరుపతి రావు

**మైలవరం, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా వైఎస్ఆర్సీపీ నాయకుడు తోట తిరుపతి రావు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం మండలం వెల్వాడం గ్రామంలోని మసియా మసీదులో స్థానిక ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ మాసం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులు శాంతి, సౌభ్రాతృత్వంతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ఎల్ హెచ్ ఆర్ కళాశాలకు హ్యాండ్ బాల్ లో తృతీయ స్థానం



**మైలవరం, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

గత మూడు రోజులుగా నున్న విజయ కాలేజ్ లో నిర్వహించిన కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీల యందు స్థానిక మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి కళాశాలకు చెందిన జట్టు వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ నున్న మరియు సిద్ధార్థ కళాశాల విజయవాడ వారిపై విజయం సాధించి సెమీఫైనల్ లో కేబీఎన్ కళాశాల విజయవాడ వారిపై ఓడి బ్రాంజ్ మెడలను సాధించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి తెలియజేశారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్లా రవి మాట్లాడుతూ కళాశాల హ్యాండ్ బాల్ జట్టు గత సంవత్సరం కంటే మెడికల్ ప్రతి ప్రదర్శించి మూడో స్థానానికి రావడం ఆనందదాయకమని అదేవిధంగా రాబోయే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశిస్తూ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తమ తమ అభినందనలు తెలియజేశారు. కారు-టీవీలర్ ఢీ కొని ఇదరికి గాయాలు

## కారు-టివీలర్ ఢీ కొని ఇద్దరికి గాయాలు



**వికోట, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

మండల పరిధిలోని విల్లుపురం-మంగళూరు జాతీయ రహదారిలో పాపేపల్లి మిట్ట వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వికోట నుంచి ఓగు వైపు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ద్విచక్రవాహనంలో పీఎంకే తండా నుంచి వికోటకు తిరుగుప్రయాణంలో వస్తున్న షబ్బీర్ కుమారుడు అంజాద్ (27) , అతీక్ అంజాద్ (25)లను ఢీకొంది. అతివేగంతో లారీని అధిగమించాలని చేసిన ప్రయత్నమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.మెరుగైన వైద్యం కోసం కుప్పం పి ఈ ఎస్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గురైన కారులో ఓగుకు చెందిన లవకుమార్ , గణేష్ లు ఉన్నారని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## లయన్స్ క్లబ్ అన్నదానానికి విశేష స్పందన



**వికోట, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

వికోట మండల పరిధిలో పలు సేవా కార్యక్రమాల్లో ముందుండే లయన్స్ క్లబ్ మరోసారి తన నెలవారి అన్నదాన కార్యక్రమంతో ప్రజలకు చేరువైంది.ఆదివారం మధ్యాహ్నం ప్రతినెలా యథావిధిగా లయన్స్ సభ్యుల పుట్టినరోజులను పురస్కరించుకుని జరిపే అన్నదాన సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపారు. మార్చి నెలలో జన్మించిన సభ్యులు కోశాధికారి సయ్యద్ సాదత్, బాబూలాల్ రాథోడ్ ,అమరేంద్ర , శంకర్ , మొయిద్దీన్, నందాలాల్ ల సహకారంతో జరిగిందని క్లబ్ అధ్యక్షుడు డా. ఏ కే తమీమ్ ఖాన్ పేర్కొన్నారు. సృష్టిలో ఒకరి కడుపు నింపే అన్నదానాని కన్నా మించిన పుణ్యకార్యం మరొకటేదని ఆయన తెలిపారు.వెయ్యి మంది ఆకలి తీర్చిన ఈ బృహత్ సేవా కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్రేష్ , వైస్ ప్రెసిడెంట్ తుకారాం, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా 'పండిట్ దీన్ దయాళ్' ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్

**గన్నవరం, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, స్థానిక రోటరీ క్లబ్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'పండి ట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్' శిక్షణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నాదెండ్ల మోహన్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన 'ఏకాత్మ మానవతావాదం' సిద్ధాంతం గురించి వివరించారు. కురుమద్దాల ఫణి కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునాది అని, క్షేత్రస్థాయిలో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలో సూచించారు. కానూరు శేషు మాధవి రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి, పార్టీ అభి వృద్ధిలో మహిళల పాత్ర మరియు సేవా కార్య క్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గన్నవరం మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మేడూరి శేషు కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు క్రమశిక్షణతో మెలిగి పార్టీ ప్రతిష్టను పెంచాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలి

- పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి
- హాల్ టికెట్‌తో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- (ఆర్‌టీఐ) ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్నావుల సురేంద్ర

**బంగారుపాళ్యం, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తమపై తాము నమ్మకం ఉంచుకుని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని (ఆర్‌టీఐ) ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్నావుల సురేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదో తరగతి ఒక కీలక మలుపు అని, దీన్ని ఎంతో బాధ్యతతో ఎదుర్కోవాలని సూచించారు. ముఖ్యంగా సమయపాలన విషయ ంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు అధికారులు నిర్ణయించిన సమయానికి కనీసం 30 నుండి 45 నిమిషాల ముందుగానే చేరుకోవడం అవసరమని తెలిపారు. చివరి నిమిషంలో హడావిడి పడటం వల్ల మానసిక ఆందోళన పెరిగి తెలిసిన సమాధానాలు కూడా మర్చిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, అవి విద్యార్థుల ప్రతిభను నిరూపించుకునే సువర్ణావకాశమని చెప్పారు. అనవసరమైన ఒత్తిడికి లోనుకాకుండా క్రమశిక్షణతో చదివిన విషయాలను ప్రశాంతంగా పేపర్‌పై రాయాలని సూచించారు. "మీరు సాధించే ప్రతి మార్కు మీ తల్లిదండ్రుల కష్టానికి, గురువుల శ్రమకు దక్కే గౌరవం. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి తమ ప్రాంతానికి మంచి పేరు



తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని జన్నావుల సురేంద్ర గుర్తుచేశారు. విద్యార్థులు సమ యానికి పోషకాహారం తీసు కోవడం, తగినంత నీరు తాగడం, కం టినిండా నిద్రపోవడం అవసరమని సూచించారు. అప్పుడు మాత్రమే మెదడు చురుగ్గా పనిచేసి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించగలరని తెలిపారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉన్నందున ఈ సౌకర్యాన్ని వినియోగిం చుక ోవాలని సూచించారు. విద్య ద్వారా సామాజిక న్యాయం, బాధ్యతాయుతమైన పౌరసత్వం సాధ్యమవుతుందని పేర్కొంటూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకో వాలని కోరారు. చివరగా రాష్ట్రంలోని అన్ని విద్యార్థుల కు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## నిడమానూరు నిర్వాసితులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**నిడమానూరు, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

నిడమానూరు ప్రధాన రహదారి వెంబడి బాపిరాజు చెరువు పరిధిలో ఆక్రమణల తొలగింపులో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ నివాస స్థలాలను కేటాయించింది. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే , ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఈ పట్టాలను ఆదివారం విజయవాడలోని తన కార్యాల యంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. గత నెలలో నిడమానూరులోని సర్వే నంబరు 109లో నిర్మించిన మూడు అక్రమ నివాసాలను పంచాయతీ అధికారులు తొలగించగా, ఆ కుటుంబాలు నివాసం కోల్పోయాయి. ఎమ్మెల్యే ఆదేశాలతో నిడమానూరు టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బండి నాని కృషితో, ప్రభుత్వం వీరికి విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో ఒక్కొక్కరికి 145.2 చదరపు గజాల చొప్పున స్థలాలను మంజూరు చేసింది. లబ్ధిదారులు కోడూరు దుర్గ నాగేశ్వరమ్మ, తిరుమలకొండ వెంకమ్మ, తిరుమల కొండ వెంకట రమణలకు ఈ పట్టాలను అందజేసిన ఎమ్మెల్యే, పేదలకు నివాస స్థలాలు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి రమేష్, కోనేరు సుభకర్, గరికిపాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థినీలకు విద్యా సామాగ్రి పంపిణీ

- మహతి ఫౌండేషన్ శాంతమ్మ చేతుల మీదగా అందజేత



**బైరెడ్డిపల్లి, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

బైరెడ్డిపల్లి నుంచి పలమనేరు వెళ్లే జాతీయ రహదారిపై కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీలకు మహతి ఫౌండేషన్‌కు చెందిన శాంతమ్మ విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 72 మంది విద్యార్థినీలకు ఆమె చేతుల మీదుగా విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు పరీక్షలపై మనోధైర్యం నింపుతూ శాంతమ్మ మాట్లాడారు. గతంలో ఈ మండలంలోని గురుకుల పాఠశాల ఉత్తమ ర్యాంకులు సాధించిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే విధంగా కృషి చేసి మొదటి నుంచి పది స్థానాల వరకు ర్యాంకులు సాధించాలని విద్యార్థినీలను ప్రోత్సహించారు. సంవత్సరం పొడవునా తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలే, ఉపాధ్యాయులు బోధించిన విషయాలే పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నలుగా వస్తాయని, కాబట్టి పబ్లిక్ పరీక్షలపై ఎలాంటి భయం అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దండా సుప్రజా, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ సంస్కృతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న టీడీపీ

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్

**విజయవాడ, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**



ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ మాఫియాకు తెలుగుదేశం పార్టీ కేంద్రంగా మారుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ఇటీవల జరిగిన ఒక ఘటనలో తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు డ్రగ్స్ పార్టీలో పాల్గొనడమే కాకుండా, నిర్వహించిన పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కామరాజ్ హరీష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వంద్వ నీతి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం 'యాంటీ డ్రగ్స్' పేరుతో సైకిల్ యాత్రలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్భాటం చేస్తోందని, మరోవైపు తమ సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు డ్రగ్స్ కేసుల్లో చిక్కుకోవడం వారి వైఖరికి నిదర్శనమని విమర్శించారు. డ్రగ్స్ పరీక్షల్లో సంబంధిత ఎంపీకి పాజిటివ్ రిపోర్టులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం గానీ, తెలుగుదేశం పార్టీ గానీ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచి చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ప్రజాప్రతినిధి ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ మాఫియాను అరికడతామని చెప్పే ప్రభుత్వం తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో రాష్ట్ర ప్రజలకు వెల్లడించాలని కోరారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్ముడవుతున్న డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, డ్రగ్స్‌ను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



## కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**కాణిపాకం, మార్చి 16 (జర్నలిస్ట్ ఫైల్)**

చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని అభిషేక సేవలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రికి స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు మరియు దేవస్థానం ఈవో పెంచల కిషోర్ దర్శన ఏర్పాట్లు చేసి మంత్రిని సత్కరించి స్వామివారి చిత్రపటంతో పాటు శేష వస్త్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, చిత్తూరు సోషల్ వెల్ఫేర్ శాఖ సిబ్బంది, ఎస్సై నరసింహులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సెమినార్‌లో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థిని ప్రతిభ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాల (ఆటోనమస్) విద్యార్థిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో ప్రతిభ కనబరిచి కళాశాలకు కీర్తి తీసుకొచ్చింది.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా--2.0 ఆధ్వర్యంలో "ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: డ్రగ్ క్వాలిటీ అసెస్‌మెంట్‌లో మార్పు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ కళాశాలల నుండి సుమారు 550 మంది విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.
సెమినార్‌లో భాగంగా నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ ఫార్మ్.డి విద్యార్థిని లహరి చింత ఫార్మకాలజీ విభాగంలో ప్రతిభ కనబరిచింది. మొత్తం 33 పోస్టర్లలో ప్రథమ బహుమతి సాధించి కళాశాలకు గౌరవం తీసుకొచ్చింది.
లహరి చింత తన బహుమతిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల చేతుల మీదుగా స్వీకరించింది. ఈ విజయానికి ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జి. సాయి శ్రీలక్ష్మి అందించిన మార్గదర్శకత్వం కీలకమని కళాశాల వర్గాలు తెలిపాయి.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి విద్యార్థినిని అభినందించారు. ఆమె ప్రతిభతో కళాశాలకు మంచి గుర్తింపు వచ్చిందని పేర్కొంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పరీక్షా విధుల్లోనే ప్రధానోపాధ్యాయుడు అన్వర్ భాష మృతి

- **ఏపీటీఎఫ్ నేతల నివాళులు - పరీక్షా విధుల్లో ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి**

**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్):** కర్నూలు టౌన్‌లోని చైతన్య ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిడ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అన్వర్ భాష ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. పరీక్షల నిర్వహణ మొదటి రోజే అస్వస్థతకు గురై, ఒత్తిడితో గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు తెలిసింది.
ఈ ఘటనపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అన్వర్ భాష ఏపీటీఎఫ్‌లో జిల్లా కార్యదర్శిగా పనిచేసి సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన మృతితో ఉపాధ్యాయ లోకం ఒక కృషిశీల నాయకుడిని కోల్పోయిందని అన్నారు.
మృతదేహాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్. ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ఐ. మరియానందం, జిల్లా కౌన్సిలర్లు హకీమ్, పెద్దస్వామి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అన్వర్ భాష సతీమణి షేక్ అతియా బేగం ఎస్‌జీటీగా పనిచేస్తున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా హృదయ రాజు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల విధుల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని విద్యాశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, అనారోగ్య సమస్యలు, అలాగే రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న ఉపాధ్యాయుల వినతిని పరిగణలోకి తీసుకుని పరీక్షా విధుల నుంచి మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వం, అధికారులను విజ్ఞప్తి చేశారు.

## ప్రొఫీసర్ డా. క్రీస్టీ ప్రదీప్ రాజ్ అకాల మరణం



**కాకుమాను,( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రొఫీసర్ డా. క్రీస్టీ ప్రదీప్ రాజ్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో మరణించడం పట్ల పలువురు నివాళు లార్పించారు. డా. క్రిస్టి ప్రదీప్ రాజ్ గతంలో కాకుమాను ప్రాథమిక వైద్య శాల నందు వైద్యధికారి గా పని చేశారు. చక్కని చిరునవ్వుతో పేషేంట్లను పలకరిస్తూ వైద్య సేవలందించేవారు. కరోనా విస్తృతంగా ఉన్న సమయం లోను ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించి స్థానిక ప్రజల మన్ననలను పొందారు.
**ప్రదీప్ రాజ్ అమూల్యమైన సేవలందించారు :** ఖుద్దుస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ మాట్లాడుతూ డా. క్రీస్టీ ప్రదీప్ రాజ్ కాకుమాను వైద్య శాల నందు ఉత్తమమైన సేవలను అందించారన్నారు. ఆయన చేస్తున్న వైద్య సేవలను చూసి తాను కరోనా విపత్కర పరిస్థితులలో ఖుద్దుస్ ఫౌండేషన్ తరుపున వైద్య బృందానికి విలువైన మెడికల్ కిట్లను ఉచితంగా అనించ్చినట్లు తెలిపారు.ప్రదీప్ రాజ్ అకాల మరణ వార్త తనను తీవ్ర బాధ కలిగించిందన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని వేడుకుంటున్నట్లు తెలిపారు.
**ఎందరికో ఆదర్శం క్రిస్టి ప్రదీప్ రాజ్:** ప్రొఫెసర్ డా. క్రిస్టి ప్రదీప్ రాజ్ ఎందరికొ ఆదర్శ ప్రాయుడని కాకుమాను ప్రాథమిక వైద్యశాల వైద్యధికారి డా. స్వర్ణ రాజశేఖర్ తెలిపారు. క్రిస్టి ప్రదీప్ రాజ్ అకాల మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు.క్రిస్టి ప్రదీప్ రాజ్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేసారు.

## పొట్టి శ్రీరాములు జయంతి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కార్యాలయంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు.
బెటాలియన్ కమాండెంట్ కె నగేష్ బాబు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి ఆశీర్వాదం అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణమూర్తి, డి వెంకటేశ్వర్లు, రవి, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- **నీటి కొరత నుంచి వీధి కుక్కల దాడి కేసుల వరకు పలు అంశాలపై అధికారులకు ప్రశ్నలు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం మరియు బడ్జెట్ పై నిర్వహించిన అత్యవసర సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని నగరంలోని పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. నీటి కొరత, టెండర్లలో పారదర్శకత, డ్రైనేజీ పనులు, వీధి కుక్కల సమస్య, శానిటేషన్, మార్కెట్ల పరిస్థితి వంటి అనేక అంశాలపై అధికారులను ప్రశ్నిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
**వేసవిలో నీటి సమస్యపై ఆందోళన :** నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్య కొనసాగుతోందని, రానున్న వేసవిలో ఈ సమస్య మరింత తీవ్రం కావచ్చని హెచ్చరించారు. డివిజన్ వారీగా ఉన్న బోరింగ్లను మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కొన్నిచోట్ల చిన్నపాటి మరమ్మత్తులు చేస్తేనే బోరింగ్లు పనిచేసే పరిస్థితి ఉందని తెలిపారు.
**టెండర్ ప్రక్రియలో అవకతవకలపై ప్రశ్న :** గత కొన్ని సంవత్సరాలుగా ఒకే కాంట్రాక్టర్లు అనేక పనులు కైవసం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనుల విలువకు 12 నుంచి 29 శాతం వరకు తక్కువ ధరకు టెండర్లు పొందుతున్నప్పటికీ పనులు సక్రమంగా పూర్తి చేయడం లేదని అన్నారు. ఇలాంటి కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు.
**బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత అవసరం :** నిజాయితీగా పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఆలస్యమవుతుండగా పనులు మధ్యలో వదిలేసిన వారికి మాత్రం చెల్లింపులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపుల్లో స్పష్టమైన విధానం ఉండాలని, పారదర్శకంగా అమలు చేయాలని కోరారు.
**డ్రైనేజీ డీసిల్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి :** వర్షాకాలానికి ముందే ప్రధాన డ్రైనేజీల డీసిల్టేషన్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకోసం ప్రత్యేక వర్క్ క్యాలెండర్ రూపొందించి సభ్యులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.
**అనధికార హోర్డింగ్స్, ఎల్ఈడి బోర్డులపై చర్యలు :** నగరంలో అనధికార హోర్డింగ్స్ పెరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఈడి డిస్ప్లే బోర్డులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వీటి అనుమతులు, బకాయిల వివరాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు.
**పివికే నాయుడు మార్కెట్ సమస్యలు :** పివికే నాయుడు మార్కెట్ పరిస్థితి దయనీయంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షం పడితే మార్కెట్ మొత్తం నీటితో నిండిపోతుందని చెప్పారు. సుమారు 200 షాపులకు సరిపడా టాయిలెట్స్ లేవని, మార్కెట్ బయట అనధికారంగా వ్యాపారం జరుగుతోందని పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను కోరారు.
**వీధి కుక్కల సమస్యపై ఆందోళన :** నగరంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా మారిందని ఎమ్మెల్యే తెలిపారు. గత నెలలో సుమారు 3 కుక్క కాటు కేసులు నమోదయ్యాయని, అందులో 900 కేసులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందినవని చెప్పారు. సమస్య పరిష్కారానికి డాగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
**శానిటేషన్ వ్యవస్థపై సూచనలు :** పుష్ కార్టు పాడైపోవడం వల్ల మహిళా శానిటేషన్ కార్మికులు వాటిని తోసుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పాత పుష్ కార్టును మార్చి కొత్తవి అందించాలని కోరారు.
**సచివాలయాల్లో కంప్యూటర్ల సమస్య :** పలు సచివాలయాల్లో కంప్యూటర్లు పనిచేయకపోవడం వల్ల సేవలు అందడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంటనే టెండర్ ప్రక్రియ ద్వారా కొత్త కంప్యూటర్లు అందించాలని సూచించారు.
**కేంద్ర స్మైల్ పథకం అమలుపై వివరాలు కోరిన ఎమ్మెల్యే :** భిక్షాటన చేసేవారు, ట్రాన్స్‌జెండర్ల పునరావాసం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న SMILE Scheme India పథకం ద్వారా వచ్చే నిధులు ఎలా వినియోగిస్తున్నారో వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఈ పథకం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.
**అభివృద్ధి పనుల పురోగతిపై సంతృప్తి :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో రూ.140 కోట్లతో 218 అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. మరో రూ.100 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. సగం వరకు ఆగిపోయిన పనులను ప్రాధాన్యంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.
నగరంలోని సమస్యలపై లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని, నిర్దిష్ట గడువులో పరిష్కారాలు చూపాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నగర పాలక సంస్థ అధికారులను కోరారు.

## గుంటూరు తూర్పు అభివృద్ధికి మరింత సహకరించండి

- **వైసీపీ పాలనలో అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం**
- **కుక్కల బెడద, శానిటేషన్ పై దృష్టి సారించండి**
- **పెండింగ్ పనులకు అనుమతులు మంజూరు చేయండి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ పనులు పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు పూర్తి సహకారం అవసరం" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూనే పెండింగ్లో ఉన్న కార్యక్రమాలు, చేపట్టవలసిన పనుల గురించి కౌన్సిల్ లో వివరించారు. ప్రధానంగా శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉందని, డివిజన్లవారీగా శానిటేషన్ ఇన్స్పెక్టర్లను నియమించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, మున్సిపల్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పాత గుంటూరు, ఏటుకూరు రోడ్డులో శ్మశాన వాటికల అభివృద్ధికి డిపిఆర్ పూర్తయిందని, కానీ ఆమోదం తెలపలేదని చెప్పారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక వెల్ఫేర్ స్థలంలో ఆసుపత్రి నిర్మాణంతోపాటు క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, దీనికి కౌన్సిల్ సహకారం అవసరమని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో మణి హాస్పిటల్ నుంచి బాలాజీ నగర్ వరకు, నాజ్ సెంటర్ నుంచి శనక్కాయల ఫ్యాక్టరీ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 40 అడుగుల రోడ్లను అరవై అడుగులుగా విస్తరించామని వెల్లడించారు.

## ఎన్డిఏ హయాంలో రైతు సంక్షేమనికి ప్రాధాన్యత

- **బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్**



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్డిఏ హయం లో మాత్రమే రైతు సంక్షేమానికి ప్రాధాన్యతను కల్పిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేత్రుత్వంలో అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దు స్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం వ్యాప్తంగా అనేక దేశాలు యుద్ధ భయలతో గడుపుతుంటే భారత దేశ ప్రజలు మాత్రం ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్డిఏ ప్రభుత్వం కృషి అభినందనీయం అన్నారు.రైతాంగ పరంగా ఎరువుల రాయితీ ల రూపంలో కేంద్ర ప్రభుత్వం సుమారు పన్నెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. దేశంలో రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యతను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అదే విధంగా రాష్ట్రం లో రైతు సంక్షేమం ధ్యేయంగా పెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీజేపీ అన్నారు.రైతుల సంక్షేమ, అభివృద్ధి కొరకు అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం లో భారత ప్రజలకు ఎటువంతు ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన మంత్రి అన్ని రకాల నిత్యావసరాలు అయిన ఆయిల్, గ్యాస్, నిత్యావసరాలు వంటి వాటికి ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. బీజేపీ తోనే దేశ అభివృద్ధి సాధ్యం అవుతుందని, దేశ ప్రజలంతా బీజేపీ వైపే అడుగులు వేస్తున్నారన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణ తరలిన టీడీపీ శ్రేణులు

- **జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి తుళ్లూరు పెద్దపరిమి రోడ్‌లోని శాఖమూరు పార్క్‌లో నిర్వహించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 58 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి నేతలు,కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు పాల్గొనేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మార్కెట్ సిగ్నల్స్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి ఈ బస్సులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఆయన జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, పరిశీలకులు సింహాద్రి కనకాచారి మరియు పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ....లి అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించడం గర్వకారణమని అన్నారు. ఇది కేవలం ఒక మహనీయుడి పుట్టినరోజు మాత్రమే కాకుండా, ప్రతి తెలుగు వాడు గుర్తుంచుకోవాల్సిన పర్వదినమని పేర్కొన్నారు.
మెద్రాస్ ప్రెసిడెన్సీ కాలంలో తెలుగువారు ఎదుర్కొన్న అవమానాలకు ఎదురు నిలిచి, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడటానికి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కావాలని సంకల్పంతో పొట్టి శ్రీరాములు గారు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం చరిత్రలో చిరస్మరణీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. తెలుగు ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం భారతదేశ చరిత్రలో ఒక మహత్తర ఘట్టంగా నిలిచిందన్నారు.
పిల్లల కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలు మనకు తెలుసని, కానీ దేశం కోసం, రాష్ట్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి ప్రభుత్వ నాయకులు ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.
58 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ విగ్రహం, పొట్టి శ్రీరాములు గారు చేసిన 58 రోజుల నిరాహార దీక్షకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో, 26 టన్నుల కాంస్యం మరియు 42 టన్నుల ఇనుముతో ఈ విగ్రహాన్ని నిర్మించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ విగ్రహాన్ని "స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్" పేరుతో ఆవిష్కరించడం శుభపరిణామమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, దేశం కోసం త్యాగం చేసిన మహనీయులను భావితరాలకు పరిచయం చేసే ఈ ప్రయత్నం అభినందనీయమని అన్నారు.

## నిజాయితీ,న్యాయం,ధర్మం గెలుస్తుంది



- **జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు కాణాల మల్లికార్జున్రెడ్డి**

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** మంచితనానికి మారుపేరైన మృదు స్వభావి మైదుకూరు నియోజకవర్గ ముద్దుబిడ్డ పూట్టా మహేష్ యాదవ్ గారి మీద ఈ విధమైన కుట్రలు చేయడం అందరి మనసులను కలిచి వేస్తోందని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు కాణాల మల్లికార్జున్రెడ్డి పేర్కొన్నారు.పుట్టా మహేష్ ఎలాంటి మనస్తత్వం గలవాడంటే తన సొంత గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు.అదే కాకుండా వృద్ధాశ్రమాలకు విరాళాలు ఇచ్చి ఆదు కుంటున్నారని ఆయన వివరించారు.అలాగే ఎన్నో స్కూళ్లకు,దేవాలయలకు విరాళాలు,వసతులు కల్పించిన మహేష్ యాదవ్ గారి మీద ఇటువంటి కుట్రలు చేయడం మైదుకూరు నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులు,నియోజకవర్గ ప్రజలందరూ చాలా ఆందోళనలో ఉన్నట్లు ఆయన చెప్పారు.మన మైదుకూరు ముద్దుబిడ్డ ఏలూరు పార్లమెంటుకు వెళ్లి మన మైదుకూరు ఆత్మగౌరావన్ని నిలబెట్టిన వ్యక్తి,ఇటీవలే తన సొంత మండలం అయినా బ్రహ్మంగారిమఠం ఎంతో వెనుకబడి ఉందని ప్రసాదం స్కీం ద్వారా వంద కోట్లు పైన నిధులు తీసుకురావడానికి తీవ్రంగా పెద్ద పోరాటం చేస్తున్నారన్నారు.అలాగే మన నియోజకవర్గం ప్రజలు వారి దగ్గరికి వెళితే ఎటువంటి సమస్యనైనా తీర్చి వారిని గౌరవంగా చూసేవారు మహేష్ ను కలిసిన ప్రతి ఒక్కరూ అనే తెలిపారు.బీసీ కులానికి చెందిన మహేష్ యాదవ్ గారు కడప జిల్లా నుండి ఏలూరు పార్లమెంటు కెళ్ళి అక్కడ పార్లమెంటు సభ్యుడుగా గెలవడం ఇష్టం లేని వైసిపి నాయకుల కలిసి ఈ కుట్రలు చేస్తున్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు.వీరికి కడప జిల్లా నుండి ఒక బీసీ వ్యక్తి ఎంపీగా వారి తండ్రి ఎమ్మెల్యేగా గెలవడం ఇష్టం లేక ఇటువంటి నిందలు మోపి ఆనందం పొందుతున్నారు.మహేష్ గారు కడిగిన ముత్యం లాగా బయటికి వచ్చి తీరుతారని ఇదే మైదుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగుజాతి జీవించినంత కాలం నిలిచి ఉంటుందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు . పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సోమవారం మంగళగిరి రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి శైలజ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజుల కఠోర ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగంతో ప్రత్యేక రాష్ట్రం సాధించిన శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. 58 రోజుల నిరావధిక నిరాహార దీక్షకు గుర్తుగా ప్రజా రాజధాని అమరావతిలో 58 అడుగుల కాంస్య విగ్రహ ఏర్పాటు చేయడం ఆయన త్యాగానికి ఇచ్చే గౌరవమన్నారు. శ్రీరాములు మరణించి ఉండొచ్చు కానీ ఆయన ఆచరించిన సత్యం, అహింసా, సత్యాగ్రహం, ఆమరణ నిరాహార దీక్ష అనే ఆయుధాలు జీవించే ఉంటాయన్నారు. ఆయన ఆచరించిన ఆయుధాలు సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని, ఆయన దేశభక్తి ఐక్యతను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలని శైలజ పిలుపునిచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఈనెల 22న శాలివాహన సాంస్కృతిక వైభవ మహాసభ



- **క్షేత్రధర్మం నిర్వర్తించే ప్రతి సామాజిక వర్గం రాజ్యపాలన చేసింది**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో ఈ నెల 22వ తేదీన వెన్యూ ఫంక్షన్ హాల్ గ్రౌండ్‌లో శాలివాహన సాంస్కృతిక వైభవ మహాసభ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కుమ్మర సామాజిక వర్గ సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ , క్షేత్ర ధర్మం నిర్వర్తించే ప్రతి సామాజిక వర్గం చరిత్రలో ఏదో ఒక సమయంలో రాజ్యపాలన చేసినట్లు పేర్కొన్నారు. కుమ్మర సామాజిక వర్గం శాలివాహన చక్రవర్తుల వారసులని, వారి చరిత్ర గొప్పదని తెలిపారు. సమాజ అభివృద్ధికి ఈ వర్గం చేసిన సేవలను గుర్తుచేశారు.

మహాసభకు సంబంధించిన శాలివాహన కరపత్రాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు ఐలాపురం భాస్కర్ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలివాడ శివకుమార్ పట్నాయక్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జాన్ లో ఇన్‌చార్జ్, టీ రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

అలాగే గుంటూరు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తురక రామారావు, పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పల్లపు శివయ్య, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మహీధర్ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు శాలివాహన సాంస్కృతిక వైభవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉప్పలపాటి శ్రీనివాస రాజు విజయం



- **బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు**

**విజయవాడ (జర్నలిస్ట్‌ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాది ఉప్పలపాటి శ్రీనివాస రాజు విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బీజేపీ రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న శ్రీనివాస రాజు గెలుపు పార్టీ వర్గాల్లో ఆనందాన్ని కలిగించింది.

విజయం అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్న శ్రీనివాస రాజును పార్టీ నాయకులు, న్యాయవాదులు ఘనంగా అభినందించారు. కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ఏపీ బార్ రెండో స్టేట్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉప్పలపాటి శ్రీనివాస రాజు అద్భుత విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం పార్టీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల మద్దతుతో ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు.

న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం, లాయర్లపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు 'లాయర్స్ అట్రాసిటీ యాక్ట్' అమలు దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్న ఆ బిల్లును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్ల సంక్షేమం కోసం, న్యాయవాద వృత్తికి మరింత గౌరవం తీసుకురావడానికి శ్రీనివాస రాజు కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఫోన్ ద్వారా శ్రీనివాస రాజును అభినందించారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మార్చి 18వ తేది గుంటూరు పట్టణ పర్యటన ప్రతిపాదన ఉండటం పట్ల జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా , పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ సోమవారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు.

మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ శ్రీ కన్వెన్షన్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయుటకు యోచిస్తున్నారు. అక్కడి నుండి ఆర్ టీ సీ బస్ స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించే పక్షంలో అందుకు తగిన అవకాశాలు పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆర్ టీ సీ బస్ స్టాండ్ వరకు పర్యటించే అవకాశాలు ఉన్నందున వాటి ఏర్పాట్లను పరిశీలించారు.

ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద జరిగే కార్యక్రమాల వివరాలు షెడ్యూల్ ఉన్నత అధికారులతో సంప్రదించి తయారు చేయాలని ఆర్.ఎం కు , అధికారులకు సూచనలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే. శ్రీనివాస రావు , ఆర్టీసీ ఆర్ ఎం సామ్రాజ్యం, ట్రాఫిక్ డీఎస్పీ బి శ్రీనివాస్, ఈస్ట్ డీఎస్పీ అజీజ్ , పాత గుంటూరు సి ఐ వెంకట రావు, లాలాపేట సిఐ శివరామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డీ ఎస్పీ శ్రీనివాస రావు, డీటీసి సీతారామిరెడ్డి, గుంటూరు ఈస్ట్ తహసీల్దార్ సుభాని , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో...టిడిపి సీనియర్ నాయకులు రావి కృష్ణమోహన్ జన్మదినవేడుకలు





**అభినందనలు తెలిపిన ఎమ్మెల్సీ ఆలపాటి**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో తనదైన సేవలు అందిస్తున్న రావికృష్ణ మోహన్ (చిన్ని) జన్మదిన వేడుకలను అభిమానులు, సోమవారం సేవాకార్య క్రమాలతో, నిర్వహించిన క్రమంలో, తొలుత మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో కేక్ కట్ చేయించి, అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు కోగంటి రోహిత్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. 50మంది యువత రక్తదాన సేవలలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యశాల రక్త నిధి, వైద్యులు రక్తాన్ని సేకరించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల లోని, తల్లీ బిడ్డల విభాగంలో పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్, ఈదర వెంకట పూర్ణచంద్, జొన్నాదుల మహేష్, కోగంటి రోహిత్ ,పర్చూరిరమ్యు లు,మీడియా ముఖంగా రావి చిన్ని పార్టీలో క్రియాశీలకంగా అందిస్తున్న సేవలను వివరిస్తు,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో , బోయపాటి అరుణ,దివి అనిత, ఫణిదపు దుర్గాప్రసాద్, డాక్టర్ వేమూరు శేషగిరిరావు,ఈదర శ్రీనివాసరావు, కేసన కోటేశ్వరరావు,కుదరవల్లి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తెలుగు యువత శ్రేణులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ లభించిందని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని డాక్టర్ ఆళ్ల సుశీల, ప్రొఫెసర్ అసాది శివశంకర్, అలాగే విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.పోలురాజులు సంయుక్తంగా ప్రతిపాదించిన పరిశోధనకు ఈ పేటెంట్ మంజూరైనట్లు వెల్లడించారు.

"యుటిలైజేషన్ ఆఫ్ స్నెయిల్ షెల్స్ ఫర్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సిమెంట్ త్రూ రిడక్షన్ ఆఫ్ ఇంపాక్ట్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్" అనే అంశంపై చేసిన పరిశోధనకు ప్రముఖ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ పేటెంట్‌ను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరిశోధనలో పర్యావరణానికి హానికరమైన పదార్థాల వినియోగాన్ని తగ్గిస్తూ, నత్త గులకల వినియోగం ద్వారా సిమెంట్ బలం మరియు మెకానికల్ లక్షణాలను మెరుగుపరచే విధానాన్ని ప్రతిపాదించారు.

సిమెంట్ తయారీ ప్రక్రియలో పర్యావరణంపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించడమే కాకుండా, సహజంగా లభించే వ్యర్థ పదార్థాలను వినియోగించి నిర్మాణ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ఈ పరిశోధన సాగిందని ఆయన వివరించారు. ఈ పేటెంట్‌కు 20 సంవత్సరాలపాటు హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం పరిశోధన విద్యార్థిని డాక్టర్ ఆళ్ల సుశీల విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలియజేసారు.

జాతీయ స్థాయి పేటెంట్ సాధించిన పరిశోధన విద్యార్థిని డాక్టర్ ఆళ్ల సుశీల, ప్రొఫెసర్ అసాది శివశంకర్‌లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు కూడా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తిరుప్పత్తూర్‌లో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు రాష్ట్రంలోని తిరుప్పత్తూర్ నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన కొక్కెర శ్రీనివాస్ యాదవ్ సోమవారం నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల బాధ్యతలలో భాగంగా సింగంపునరి నార్త్ మండలంలో అయ్యనార్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశం మండల అధ్యక్షురాలు షణ్ముగ సుందరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా కొక్కెర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎన్నికల నిర్వహణను బలోపేతం చేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమికి ఓట్ల బదిలీ సమర్థంగా జరిగేలా వివిధ విభాగాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనంతరం నవీకరించిన ఓటరు జాబితాలను సంబంధిత ఇన్‌చార్జ్‌లకు అందజేశారు.

శక్తి కేంద్రాల స్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రతి ఓటరును చేరుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పార్టీ కార్యకర్తలు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ చొక్కలింగం జి, నియోజకవర్గ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ గణేశన్, అసెంబ్లీ కన్వీనర్ కేవీ నాగరాజన్, జిల్లా పేరెంట్ బాడీ సెక్రటరీ సాందిని, అసెంబ్లీ కోఆర్డినేటర్ రామేశ్వరన్, సీనియర్ నాయకుడు కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగంలో నిర్వహించిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ సోమవారంతో ముగిసింది. ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది.

సెంట్రల్ ఎయిర్ మెన్ సెలెక్షన్ బోర్డు ప్రెసిడెంట్ (న్యూ ఢిల్లీ) గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ చబ్బా సైతం ఎంపిక ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ ఆధ్వర్యంలో ఎంపిక కార్యక్రమం జరిగింది. మార్చి 9న ప్రారంభమైన ఈ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష యువత ఇందులో దాదాపు ఎనిమిదివేలకు పైగా హాజరయ్యారు.

# దివంగత కౌన్సలర్ ఫాతిమాకు నివాళులు







**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** దివంగత వార్డు కౌన్సిలర్ షేక్ ఫాతిమా భౌతికంగా దూరమై 11సంవత్సరాలైనా, ఆమె కుటుంబ సభ్యులు,ఆమె పేరిట చేపడుతున్న సేవాకార్యక్రమాల ద్వారా మన మధ్యనే ఫాతిమ ఉన్నదనే భావన వ్యక్తమవు తుందని,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఫాతిమాకు ఘనంగా నివాళులు అర్పించారు.స్థానిక మారీస్ పేట 22వ, వార్డు దివంగత కౌన్సిలర్ షేక్ ఫాతిమ 11,వ, వర్ధంతిని పురస్కరించుకుని, ఆమెభర్త రేపల్లె సుభాని ఆధ్వర్యంలో, సోమవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుదేశం నాయకులు ఫాతిమా చిత్రపటం చెంత, పువ్వులుంచి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి వస్త్ర దానం, అన్నదానం సేవలను ప్రారంభిచారు.పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్, జనసేన మైనార్టీ నాయకులు జాకీర్ హుసేన్ లు, మీడియా ముఖంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఫాతిమా వార్డు కౌన్సిలర్ గా, వార్డు అభివృద్ధిలో మెరుగైన సేవలు అందించారని, దురదృష్ట వశాత్తు, ఆమె భౌతికంగా దూరమైనా, ఆమె సేవా దృక్పదాన్ని భర్త సుభాని ముందుకు తీసుకు వెళ్ళే క్రమంలో, ఆమె పేరిట ప్రతి ఏటా వర్ధంతి, జయంతి కార్యక్రమాలు సామాజిక సేవలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావి చిన్ని, మంగమూరి హరిప్రసాద్, కోగంటి రోహిత్, మంగమూరి యుంగంధర్, ఈదర వెంకట పూర్ణచంద్, ఫణిదపు దుర్గాప్రసాద్, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, కుదరవల్లి శ్రీనివాసరావు, పావులూరి రాంబాబు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరోధకంగా మారిన వైసీపీ



- **ఏ పి టి ఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం**
- **పెట్టుబడులను అడ్డుకునేలా కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** విశాఖ ఐటీ విప్లవంపై వైసీపీ కుట్రలు హేయం టీడీపీ గూగుల్ సంస్థను ప్రోత్సహిస్తుంటే... వైసీపీ గుండాయిజాన్ని రెచ్చగొడుతోంది ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లలో చేసిన పాపాలు రాష్ట్ర భవిష్యత్తుకు పెను శాపాలుగా మారాయని, లక్షల కోట్ల రూపాయులు అప్పులు చేసి ఆంధ్రప్రదేశ్ ను అప్పులు ఆంధ్రప్రదేశ్ గా మిగిల్చిపోవడమే కాకుండా... తాజా అభివృద్ధి నిరోధకులుగా మారి మరింత నష్టాన్ని కలిగించడం దుర్మార్గమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ సోమవారం వ్యాఖ్యానించారు. తప్పుడు ప్రచారాలతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకునేలా కోర్టుల్లో కేసులు వేయడం దారుణమన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులు అడ్డుకోవడమంటే... నోటి దగ్గర కూడు లాక్కున్నట్లేనని అన్నారు. ఆఫర్ లెటర్లు ఇచ్చే కంపెనీలు కావాలో... కంపెనీలను తరిమేసే అఫిడవిట్ల కేసులు కావాలో ప్రజలకు తెలుసు కాబట్టే కూటమికి ప్రజలు పట్టం కట్టారని అయినా వారి తీరులో ఏమాత్రం మార్పు రాకపోవడం విచారకరమన్నారు. టీడీపీ గూగుల్ సంస్థను తీసుకొస్తే...వైసీపీ గుండాయిజాన్ని ప్రోత్సహించింది. ఐదేళ్లుగా విశాఖను గంజాయికి, భూ కబ్జాలకు అడ్డాగా మార్చిన వైసీపీకి... ఈ రోజు అక్కడ ఐటీ కంపెనీలు రావడాన్ని జీర్ణించుకోలేక చవకబారు ఆరోపణలతో కేసులు వేయడం దిక్కుమాలిన చర్య అని మోహనకృష్ణ నిప్పులు చెరిగారు. విశాఖలో గూగుల్ సంస్థకు కేటాయించిన భూములపై వైసీపీ నాయకులు కేసులు వేయడాన్ని మన్నవ మోహనకృష్ణ తీవ్రంగా ఖండించారు.. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ మరియు డేటా సెంటర్ పెట్టుబడిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వైసీపీ తిరుపతి ఎంపీ మద్దిలా గురుమూర్తి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ధనదాహంతో ఐదేళ్ల పాలనలో వేలాది కంపెనీలు రాష్ట్రం నుంచి తరిమేశారని, విజనరీ లీడర్ చంద్రబాబు పాలనలో వస్తున్న పెట్టుబడులపై కుట్రలు పన్నడం జగన్‌రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ల్యాండ్ పాలసీపై కోర్టులో కేసు వేయగా రాయితీలు లేకుండా పరిశ్రమలు ఎలా వస్తాయని హైకోర్టే ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు వైసీపీ ఎంపీ మద్దిలా గురుమూర్తి భూముల కేటాయింపులపై పిల్ వేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని మోహనకృష్ణ ధ్వజమెత్తారు. 2014-19 మధ్య రాష్ట్రానికి వచ్చిన కంపెనీల్లో సగానికి పైగా సంస్థలను జగన్ రెడ్డి ప్రభుత్వం తరిమేసిందని, టీసీఎస్, కీయా అనుబంధ పరిశ్రమలు, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, హెచ్‌ఎస్‌బీసీ, లులూ, బీఆర్ పెట్టి గ్రూప్స్, ఏపీపీ పేపర్ పరిశ్రమ, సింగపూర్ స్టార్టర్లు వంటి అనేక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లాయని తెలిపారు. దశాబ్దాలుగా రాష్ట్రానికి ఆదాయ వనరుగా నిలిచిన అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీని కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని అన్నారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను తరిమేసిన ప్రభుత్వంగా వైసీపీ చరిత్రలో నిలిచిందని, దాని ఫలితంగా రాష్ట్రంలో నిరుద్యోగిత 24 శాతం వరకు పెరిగిందని పేర్కొన్నారు. సంక్షేమం మాటున మాయ మాటలు చెప్పినా... వైసీపీ పానలలో అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. వైసీపీ పాలనలో పూర్తిగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వ్యవస్థను కేవలం 20 నెలల్లోనే పునరుద్ధరించి "బిల్డప్ ఆంధ్ర" నుంచి "బ్రాండ్ ఆంధ్ర"గా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి, పట్టుదల, గ్లోబల్ అవుట్‌రీచ్ వల్లే నేడు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకు స్వర్గధామంగా మారిందన్నారు. దేశంలోనే అత్యుత్తమమైన 25 పారిశ్రామిక విధానాలను అమలు చేసి, దేశ విదేశాల్లో స్వయంగా పర్యటిస్తూ పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం ఇదేనన్నారు. కేవలం 20 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. అభివృద్ధిలో కూటమి ప్రభుత్వంతో పోటీ పడలేక కోర్టుల్లో కేసులు వేసి రాష్ట్రాన్ని నాశనం చేయాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని, వైసీపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని మోహనకృష్ణ కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467